క్లుప్తంగా

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



చిన్నచింతకుంట: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం చిన్నచింతకుంట, దేవరకద్ర యూనియన్ బ్యాంకు, ఉంద్యాల సీబీఐ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 8యూనిట్లకు 210మంది దరఖాస్తు చేసుకోగా, 63మంది హాజరైనట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలానికి 8యూనిట్లు మాత్రమే ఇస్తే మిగితా వారి పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఎంపీడీఓతో ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీఓ అనీల్‌కుమార్, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం

జడ్చర్ల టౌన్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆమరణ నిరాహారదీక్ష ఫలితంగా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు చేశారని, ఇది బీఎస్పీ విజయమని నియోజకవర్గ అధ్యక్షుడు లీడర్ శ్రీను అన్నారు. శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ కేంద్రం అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 36లక్షల మంది నిరుద్యోగుల పక్షాన హైదరాబాద్ బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో శాంతియుత ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తమ నాయకుడు ప్రవీణ్‌కుమార్ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. టీఎస్‌పీఎస్సీ ఇటీవల నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్, టీఎస్‌పీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయాలన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు మహేష్, యాదగిరి, పురుషోత్తం, మహేష్, భరత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో ఉన్న 10శాతం ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ శుక్రవారం టీఆర్‌ఎస్ నాయకుడు తప్పెట చంద్రకాంత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సీఐ రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరిలకు ఫిర్యాదు చేసి వెంటనే స్థలాన్ని స్వాధీనపర్చుకుని ఫెన్సింగ్ చేయించాలని కోరారు.

కక్ష్యసాధింపు చర్యలు సరికాదు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజకీయ కక్ష్యతోనే బీజేపీ ఎమ్మెల్సీ కవితపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతుందని బీఆర్‌ఎస్ నాయ కుడు, సామాజికవేత్త హనీఫ్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. దేశాన్ని దోపిడీ చేస్తున్న కార్పొరేట్ దొంగలపై కేసులు ఉండవా అని ప్రశ్నించారు. బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఎంతోమంది కార్పొరేట్ శక్తులు దేశాన్ని లూటీ చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నో లక్షల కోట్ల కుంభకోణాలు, అక్రమా లు, స్కాంలను వదిలేసి ఎలాంటి ఆధారాలు లేకుండా కవితను, ఢిల్లీలో మనీషా సిసోడియాను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు.

సంతలో దొంగల బెడద

బాలానగర్: ప్రతి శుక్రవారం మండల కేంద్రంలోని సంత బజారులో నిర్వహించే వారాంతపు సంతలో దొంగల బెడద ఎక్కువైంది. జాలగడ్డ తండా రవినాయక్ వద్ద రూ.30వేల విలువ చేసే మొబైల్, నేరళ్లపల్లి శ్రీను వద్ద రూ.19వేలు, మరో వ్యక్తి వద్ద రూ.12వేల విలువ చేసే ఫోన్లు దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ జయప్రసాద్‌ను వివరణ కోరగా, సంతలో గస్తీ నిర్వహిస్తున్నామని, సెల్‌ఫోన్ దొంగలను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నూతన రైలు మంజూరు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా మీదుగా అజ్మీర్ షరీఫ్ దర్గా వరకు నూతన రైలు మంజూరు చేయాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ జహంగీర్ బాబా శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయానికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించినట్లు పేర్కొన్నారు. వారంలో మూడు రోజులు మాత్రమే హైదరాబాద్ నుంచి అజ్మీర్ వెళ్లడానికి సౌకర్యం ఉందని, రెండు నెలల ముందుగా కూడా టికెట్లు కూడా అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి చాలా మంది అజ్మీర్ షరీఫ్‌కు వెళుతుంటారని, వారి సౌకర్యార్థం జిల్లా మీదుగా నూతన రైలు నడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎస్‌ఐగా సతీష్



కోయిల్‌కొండ: మండల ఎస్‌ఐగా శుక్రవారం సతీష్ బాధ్యతలు స్వీకరించారు. మద్దూర్ మండలం నుంచి కోయిల్‌కొండకు వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన శ్రీనయ్యకు మండల నాయకులు, అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు.

కేంద్రం నిధులు విడుదల చేయాలి

- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి



మిడ్జిల్‌లో సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి

భూత్పూర్: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, విద్యుత్ దీపాలకు సంబంధించిన కేంద్రం ప్రభుత్వం విడుదల చేసే నిధులు సరిపోవడం లేదని, నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రెజరీల్లో డబ్బులు ఉన్నట్లు చూపిస్తున్నా డ్రా చేయకుండా ఫ్రీజ్ చేశారని, దీంతో గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు నిధులు డ్రా కావడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో చేపట్టిన పాత పనులకు బిల్లులు ఇవ్వడం లేదని, గ్రామ కంఠం భూమిని తహసీల్దార్ సర్వే చేయడం లేదని రావులపల్లి సర్పంచ్ శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల వివరాలను వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, ఎంపీడీఓ మున్నీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల గైర్హాజరు..

మిడ్జిల్: మండల సమస్యలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ తిరుపతమ్మ అధ్యక్షతన ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలో 9మంది ఎంపీటీసీలకు గాను సమావేశానికి ఎంపీపీతో కలిసి ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. 24మంది సర్పంచ్‌లకు గాను ఒక్కరు కూడా హాజరుకాలేదు. సమావేశంలో సమస్యలు అడిగే ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పాటు అధికారులు కూడా సరిగా లేకపోవడంతో తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ సాయిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ గీత, ఎంపీఓ అనురాధ, ఎంపీటీసీలు గౌస్, రాజారెడ్డి, డాక్టర్ మనుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అధికారమిస్తే రుణమాఫీ చేస్తాం



పెద్దమునుగల్‌ఛేడ్‌లో ప్రచారం చేస్తున్న చిన్నారెడ్డి

అడ్డాకుల: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేస్తామని మాజీ మంత్రి, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని చిన్నమునుగల్‌ఛేడ్, పెద్దమునుగల్‌ఛేడ్ గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. మహిళలకు రూ.500లకే వంటగ్యాస్ అందజేస్తామని తెలిపారు. నిరుపేదల ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలను అందజేస్తామని తెలిపారు. భూముల సమస్యలను పరిష్కరించకుండా ధరణితో ఇబ్బందులు పెడుతున్నందునా తాము అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు. బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పెద్దమందడి అధ్యక్షుడు పెంటన్న, అడ్డాకుల అధ్యక్షుడు నాగిరెడ్డి, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షఫీఅహ్మద్, అంజనేయులు, చిట్టిబాబు, శ్రీనివాసులు, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి పనిచేయాలి..

కోయిల్‌కొండ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జమాల్‌పూర్‌లో కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా పార్టీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు గ్రామంలోని ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్‌గౌడ్, కృష్ణయ్య, జగన్, గోవర్ధన్‌గౌడ్, మనోజ్, గౌస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

న్యూమాంక్స్ కుంగ్‌ఫూ జిల్లా అధ్యక్షుడికి అవార్డు



మహబూబ్‌నగర్ క్రీడలు: న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం జిల్లా న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్‌కు అవార్డు అందజేసి సత్కరించారు. ప్రభాకర్‌ను ఆలిండియా న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఫౌండర్ మాస్టర్ డాక్టర్ రవికుమార్, డాక్టర్ నొహీరాషేక్‌లు షీల్డు, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ సౌతిండియా ఇన్‌స్ట్రక్టర్ కనకం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని నాగసాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కమిషనర్ మహమూద్‌షేక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ గ్రామంలో రెండు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మహిళలు, వృద్ధులు బిందెలతో నీళ్ల తెచ్చుకోటానికి ఇబ్బంది పడుతున్నారని వివరించారు. మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘాల నాయకులు శివలీల, సాయిలు, నాగరాజు, బాలయ్య, పెద్ద చెన్నయ్య, శివ, బంధిగమ్మ, సంధ్య, బాలమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ప్రజాప్రతినిధులు, భక్తులు

రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్‌లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీపీ సుశీల రమేష్‌నాయక్‌తో పాటు గ్రామస్తులు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఆలయం చుట్టూ ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో ఊరేగింపు చేపట్టిన అనంతరం మహిళలు సుందరంగా అలంకరించిన బోనాలతో గ్రామం నుంచి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి తమ మొక్కులను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, భీమయ్య, ఉపేందర్డ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



హన్వాడ: మండలంలోని లింగన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, హెచ్‌ఎం రాఘవేందర్, ఉపాధ్యాయురాలు సంతోషి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుపై సంబరాలు



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి

పాలమూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపొందిన సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో టపాసులు కాల్చారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఏపీ జితేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జయశ్రీ, నాగరాజు యాదవ్, అంజయ్య, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో ఏవీఎన్ రెడ్డి గెలుపొందడంపై మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు లాలు, నాయకులు జంగిలయ్య, అరవింద్, శివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఏవీఎన్ రెడ్డి గెలుపొందడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొల్లం సునీల్ కుమార్, బాబునాయుడు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శోభాకర్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డి విజయం సాధించటంపై శుక్రవారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, బీజేపీ సంయుక్త ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. తపస్, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని టపాసులు పేల్చి సంబరాలు చేశారు.



జిల్లా కేంద్రంలో నినాదాలు చేస్తున్న తపస్ నాయకులు



కౌకుంట్లలో హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకద్ర రూరల్: బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడంతో శుక్రవారం కౌకుంట్ల మండల కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్, శ్రీను, రాంరెడ్డి ఫారూఖ్, నరేషచారి, రాంరెడ్డి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

పాలమూరు అభివృద్ధే ధ్యేయం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కేక్ తినిపిస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాలమూరు అభివృద్ధే తన ధ్యేయమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో అభివృద్ధిపై మంత్రి కృషిపై రూపొందించిన వీడియో సాంగ్‌ను శుక్రవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌజ్‌లో ఆవిష్కరించారు. నాలుగున్నర నిమిషాల నిడివి ఉన్న పాటను గోపాల్ రచించగా, రాము పాటను పాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాక మంత్రి చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై పాటను రూపొందించారు. నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన ఆధారాభిమానాలు కొండంత బలమన్నారు. అనంతరం కేక్ కట్ చేసిన మంత్రిని పలువురు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రామకృష్ణ, టీజీఓ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్, రైటర్‌రాము, సింగర్ రామకృష్ణ, రాజు, రాధా, రియాజ్ బాబర్, రాము, అక్రమ్, రఘు, రాజశేఖర్, గణేష్, భూచంద్రమణి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

హన్వాడ: మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాల్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, జిల్లా రైతుబంధు సమితి కోఆర్డినేటర్ రమణారెడ్డి, ఎఫ్‌ఏసీఎస్ వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, నాయకులు గంగాపురి, మన్నన్, ఖాజయ్యగౌడ్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన



పార్టీ జెండావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్ర, దేశ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బోట్యానాయక్ తండాలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం కోయిల్‌కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల అదనపు గదుల కోసం రూ.60లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని జమాల్‌పూర్‌లోని ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మోదీపూర్‌లోని శివాలయం, శ్రీవేంకటేశ్వర స్వామి నూతననాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, భీంరెడ్డి, మోదీపూర్ రవి, శ్రీనివాస్‌రెడ్డి, మాదవులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

హన్వాడ: తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేసి చెత్తబండిల్లో వేయాలని ఎంపీడీఓ ధనుంజయగౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఏనెమీది తండాలో స్వచ్ఛభారత్ మిషన్–2 కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం అధికారుల బృందం గ్రామాన్ని సందర్శించి గ్రామ నమూనా వేసి అందరికీ మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల వినియోగం వంటి వాటిపై ఆరాతీశారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వినియోగించాలని సూచించారు. ఇళ్ల నుంచి వచ్చే వృధానీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మజ, ఈజీఎస్ ఏపీఓ హేమలత, స్వచ్ఛ భారత్ మిషన్–2 అధికారులు పవన్, రవి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఇటీవలే జరిగిన సౌతిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో మున్సిపాలిటీ పరిధిలోని ఎదిర రెవెన్యూ వార్డుకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు సీనియర్ కరాటే మాస్టర్ సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు తులసి (9వ తరగతి), అపర్ణ(9వ తరగతి), మేఘన(7వ తరగతి) పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాలలో హెచ్‌ఎం హేమచంద్రుడు, పీఈటీ మేరిపుష్ప, కరాటే మాస్టర్ సత్యనారాయణ తదితరులు అభినందించారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో రాణించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

తిరుమలనాథస్వామి ఆలయంలో పూజలు



గద్వాల చంద్రశేఖరరావు దంపతులను సన్మానించిన సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీడీ గుట్టలోగల తిరుమలనాథస్వామి ఆలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయకుడు గద్వాల చంద్రశేఖరరావు కుటుంబ సమేతంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఏకాంత, సుప్రభాత సేవ అనంతరం 108 కొబ్బరిబొండాల తీర్థంతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం గద్వాల చంద్రశేఖరావు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీరాంరెడ్డి, నారాయణరెడ్డి, రమేష్‌కుమార్, అనంతయ్య, కోటిరెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



బాలానగర్: మండలంలోని ఊటకుంట తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సంజునాయక్ గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.20వేలు విరాళంగా అందజేశారు. గ్రామాభివృద్ధి కోసం మరింత మంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రవినాయక్, నర్సింహనాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ శివప్రసాద్ శుక్రవారం రూ.5వేలను విరాళంగా అందజేశారు. ప్రధాన ఆలయంలోని గర్భాలయ ముఖ ద్వారాన్ని పంచలోహాలతో నిర్మించడానికి తన విరాళాన్ని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, ఆలయ ఉద్యోగి అనంతసేన్‌రావు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండండి

అడ్డాకుల: గ్రామాల్లో సంచరించే అపరిచితులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూత్పూర్ సీఐ రజితారెడ్డి అన్నారు. మండలంలోని కాటవరం గ్రామంలో శుక్రవారం ఆమె గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. రోడ్డు నిబంధనలపై అవగాహన పెంచుకుని రోడ్డు దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలని, మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విజయకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.